క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని కోదడ్డపనస గ్రామంలో స్వయం భూ అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 108 కలశాలతో పూజ, హోమం చేపట్టారు. ఆలయ నిర్మాణంలో భాగంగా రాతితో తయారుచేసిన 18 మెట్లును భారీ క్రేన్ సహాయంతో ఏర్పాటు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

దుకాణాలు తొలగించొద్దని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిరువ్యాపారులు

సరుబుజ్జిలి: స్థానిక జంక్షన్‌లో ఆర్‌అండ్‌బీ రహదారుల విస్తరణ పేరుతో చిరువ్యాపారాలు సాగిస్తున్న తమ పొట్టకొట్టవద్దని వ్యాపారులంతా కలిసి గురువారం తహహీల్దార్ ఎల్.మధుసూదన్ కలిసి వినతిపత్రం అందించారు. ఎటువంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండా సంబంధిత యంత్రాంతం దుకాణాలను తొలగించేందుకు సిద్ధం కావడం దారుణమన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎవరికీ ఇబ్బంది లేకుండా వ్యవహరించడం జరుగుతుందని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

కార్డెన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ

కొత్తూరు: మండలంలోని మహసింగూడ గిరిజన గ్రామంలో గురువారం స్థానిక ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తన సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ఎటువంటి అనుమతులు లేని 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపిస్తే అందజేస్తామన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే తమకు సమాచారం అందజేయాలన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే గోవిందరావు, మండల అధికారులు

పాతపట్నం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పాతపట్నం ఎమెల్యే మామిడి గోవిందరావు అన్నారు. జిల్లా ఆవిర్భావ వేడుకల్లో భాగంగా పాతపట్నం నీలమణిదుర్గ ఆలయ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, ఎంపీడీఓ పి.చంద్రకుమారి, ఏఓ సురేష్, హెచ్ఎం ఎస్.వైకుంఠరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సురవరపు సిమ్మినాయుడు

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కోరింది. గురువారం పట్టణంలోని ఎస్టీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘ అధ్యక్షుడు సురవరపు సిమ్మి నాయుడు మాట్లాడుతూ.. పెన్షనర్ల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాల రాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్టీఓ బి.కృష్ణారావు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు, కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, సంఘ ఉపాధ్యక్షుడు దాశ్యం లక్ష్మణరావు, బెండి సూర్యనారాయణ, బొడ్డేపల్లి వెంకటరమణ, కార్యదర్శులు పి.వి.ఎస్ మాస్టారు, పేడాడ భానుజీరావు, కర్నేన జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టొద్దు..

మహాప్రభో..!



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆయన పేరు గొద్దు సన్యాసి. తామరాపల్లి గ్రామం. చిన్నతనంలోనే పోలియోతో కాళ్లు, చెయ్యి బలహీనంగా మారాయి. ఈయనకు చాలా ఏళ్లుగా పింఛన్ వస్తోంది. ఇప్పుడు సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌లో దివ్యాంగత్వం తక్కువ పెర్సెంటేజీ ఇచ్చారు. పింఛన్ కట్ అయిందని సచివాలయ సిబ్బంది అంటుండటంతో లబోదిబోమంటున్నాడు. అధికార పార్టీ నాయకులను కూడా కలిసి గోడు విన్నవించుకున్నాడు.



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు మండ గణేష్, మడపాం గ్రామం. చిన్నతనంలోనే పక్షవాతం వచ్చింది. నడవలేడు, సక్రమంగా మాట్లాడలేడు. భార్య సుజాతే అన్నీ తానై సేవలు చేస్తోంది. గత ప్రభుత్వ కాలంలో పింఛన్ మంజూరైంది. చూడటానికి బాగానే ఉన్నాడని భావించి పింఛన్ కట్ చేస్తున్నారు. ఇతని పరిస్థితి బాధాకరం.

- సదరంలో సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పూర్తి..
- పింఛన్ల కట్ చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు
- ఆందోళనలో దివ్యాంగులు
- నరసన్నపేట మండలంలో 268 పింఛన్లు తొలగించేందుకు రంగం సిద్ధం
- నోటీసులు సిద్ధం చేస్తున్న సచివాలయ సిబ్బంది



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు నరసన్నపేట ఆస్పత్రికి వచ్చిన దివ్యాంగులు (ఫైల్)

నరసన్నపేట: దివ్యాంగుల పొట్ట కొట్టడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. అధికారం చేపట్టాక దివ్యాంగులకు పింఛన్ డబ్బులు పెంచినట్టే పెంచి ఇప్పుడు అనర్హత పేరున పదుల సంఖ్యలో కత్తిరించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దివ్యాంగుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పూర్తయింది. డాక్టర్లు ఇచ్చిన రిపోర్టు ప్రకారం పింఛన్లు కట్ చేయడానికి రంగం సిద్ధం చేసింది. నరసన్నపేట మండలంలో ఏకంగా 268 దివ్యాంగ పింఛన్లు కట్ కానున్నాయి. ఈ మేరకు సచివాలయాల వారిగా అర్హుల, అనర్హుల జాబితాలు వచ్చాయి. మండలంలో 498 మందికి దివ్యాంగ పింఛన్లు వస్తుండగా.. వీటిలో 268 మందికి పింఛన్లు సెప్టెంబర్ నుంచి కట్ అయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఆనోటా.. ఈనోటా సమాచారం తెలుసుకున్న కొంతమంది ఎంపీడీఓ కార్యాలయం, అధికార పార్టీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరగడం ప్రారంభించారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో పింఛన్లు కట్ కావడం శోచనీయమే. దటీజ్ కూటమి ప్రభుత్వం అని స్థానికులు అంటున్నారు. మా పొట్ట కొట్టడం దారుణమని దివ్యాంగులు ఆవేదన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నరసన్నపేట పంచాయతీ పరిధిలోని నాలుగు సచివాలయాల్లో 51 దివ్యాంగ పింఛన్లు తొలగనున్నాయి. కంబకాయ సచివాలయం పరిధిలో 26, బొరిగివలసలో 6, చెన్నాపురంలో 10, చిక్కాలవలసలో 13, చోడవరంలో 10, గోపాలపెంటలో 6, జమ్ములో 5, కామేశ్వరిపేటలో 8, కరగాంలో 17, కోమర్తిలో 15, లుకలాంలో 11, మడపాంలో 15, మాకివలసలో 11, నడగాంలో 7, రావులవలసలో 7, దూకులపాడులో 9, తామరాపల్లిలో 7, తెలగవలసలో 10, ఉర్లాంలో 16, యారబాడు సచివాలయంలో 8 పింఛన్లు తొలగించేందుకు రంగం సిద్ధమైంది.

30 ఏళ్లుగా పింఛన్ వస్తోంది



చిన్నతనం నుంచి ఒక కాలు పనిచేయదు. కర్ర ఊత లేకుండా నడవలేను. గడిచిన 30 సంవత్సరాల నుంచి దివ్యాంగ పింఛన్ వస్తోంది. ఇప్పుడు అనర్హత చూపించి పింఛన్ కట్ చేశారని తెలుస్తోంది. నాకు ఈ పింఛనే జీవనాధారం. అధికారులు చర్యలు తీసుకొని కొనసాగించాలి. ఎంపీడీఓను కలిస్తే నేను ఏమీ చేయలేను అని అంటున్నారు.

– బరాటం రామారావు, బాడాం

మరణమే శరణ్యం..



నా వయసు 61 సంవత్సరాలు. ఐదేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. ఒక కాలు, చేయి పనిచేయడం లేదు. ఒకరి తోడు లేకుండా నడవలేను, కదల లేను. గత ప్రభుత్వం దయ వలన దివ్యాంగ పింఛన్ వస్తోంది. ఇప్పుడు కట్ చేశారని తెలుస్తోంది. నా భార్య రమణమ్మ సహాయం లేకపోతే ఏ పనీ చేయలేను. ఇప్పుడు ఈ పింఛన్ ఆధారం లేకుండా చేస్తే మరణమే శరణ్యం.

– రెడ్డి మాధవరావు, మడపాం

పింఛన్ డబ్బులే ఆధారం..



నడవలేను. ఒకరి సహాయం లేకుండా కదల్లేను. నేను బాగానే ఉన్నానని చెప్పి పింఛన్ కట్ చేస్తున్నారు. ఇంత దారుణంగా వ్యవహరించడం శోచనీయం. నా పొట్ట కొట్టొద్దు. ఈ పింఛన్ డబ్బులే నాకు ఆధారం. గత 15 ఏళ్లుగా పింఛన్ వస్తోంది. పింఛన్‌ను కొనసాగించాలి.

– బైరి అప్పన్న, మాకివలస

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. గురువారం ఆమె పాతపట్నంలో విలేకర్లతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీని అస్థిరపరిచేందుకు కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. అడ్డగోలుగా పోలింగ్ జరిపించారన్నారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను సైతం రానివ్వకుండా.. బయట ప్రాంతాల నుంచి టీడీపీ గూండాలను తీసుకువచ్చి రిగ్గింగ్ చేసుకున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చారని మండిపడ్డారు. ప్రజలు అన్ని విషయాలనూ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కూటమి నాయకులకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

చంద్రబాబు వైఫల్యాలను ఎండగట్టాలి



కె.జె.పేటలో క్యూఆర్ కోడ్ ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: సీఎం చంద్రబాబు పాలనలోని వైఫల్యాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని కె.జె.పేట, పాతపాడు, యరగాం గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రికాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌ను అందించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తోపాటు అనేక హామీ ఇచ్చి వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ ప్రధార కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కింజరాపు సురేష్, మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, విజయరాంపురం సర్పంచ్ బెండి అప్పలనాయుడు, పున్నపురెడ్డి తవిటినాయుడు, యడ్ల ఈశ్వరరావు, రావాడ రవి కుమార్, బద్రి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ..



ఈ చిత్రం నరసన్నపేట మండలంలోని బడ్డవానిపేట వద్ద రోడ్డు మార్జిన్ దుస్థితి. బడ్డవానిపేట వద్ద రోడ్డు మార్జిన్లను కొంతమంది రైతులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దీంతో రోడ్డుకు రెండు వైపులా ఉన్న మార్జిన్లు చిక్కిపోతున్నాయి. ఫొటోలో కనిపిస్తున్న విద్యుత్ స్తంభాల వరకు మట్టి ఉండేది. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోని ఆక్రమణలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

జలమయం..



ఈ చిత్రం మండంలోని పెనుబర్తి–గోరింట రైల్వే అండర్ పాసేజ్. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు కురిసిన వర్షానికి పూర్తిగా నీటితో నిండిపోయింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

– పొందూరు

ఉద్యమ కెరటం కిల్లి

- మూడున్నరేళ్లు జైల్లో గడిపిన అప్పలనాయుడు
- స్వాతంత్య్రం వచ్చిన తరువాత తొలి ఎమ్మెల్యేగా విజయం



అప్పలనాయుడు (ఫైల్)



సరుబుజ్జిలి: స్వాతంత్ర్య ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన వ్యక్తుల్లో సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన కిల్లి అప్పలనాయుడు ఉన్నారు. సిక్కోలు గెడ్డపై అహంకారంతో విర్రవీగిన జమీందార్ల గుండెల్లో గుబులు పుట్టించిన విప్లవ వీరుడు. ఆనాటి జమీందారుల పైశాచిక పాలనలో నలిగిపోతున్న రైతుల గుండె ఘోషకు స్పందించి 1931లో విప్లవ శంఖారావం పూరించారు. మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహం కోసం పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ ఉద్యమంలో అప్పలనాయుడు ప్రముఖ పాత్ర వహించారు. పుల్లెల శ్యామసుందరరావు నాయకత్వంలో ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు నిర్వహించిన పాదయాత్రలో కీలక పాత్ర వహించారు. 1939లో విజయవాడలో జరిగిన ఆంధ్ర మహాసభలో శ్రీకాకుళం జిల్లా ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. 1940 మార్చిలో కాశీబుగ్గలో జరిగిన అఖిలభారత్ కిసాన్ మహాసభకు నాయకత్వం వహించారు. ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వ నిషేధపు ఉత్తర్వులను ఉల్లఘించి వేలాది మంది రైతు కూలీలతో కలిసి నాటి మహాసభలో పోరాటం సాగించారు. స్వాతంత్ర్య సమర యోధుడు గౌతు లచ్చన్నకు సమకాలీకునిగా వ్యవహరిస్తూ ఆయనకు కుడిభుజం అయ్యారు.

1942లో క్విట్ ఇండియా ఉద్యమం జరుగుతున్న రోజుల్లో ఆమదాలవలస మండలంలోని దూసి రైల్వే స్టేషన్‌కు గాంధీ వస్తున్నట్లు తెలుసుకుని అప్పట్లో అక్కడ సభ జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అప్పటికే సభ జరగకుండా అడ్డుకునేందుకు బ్రిటీష్ పోలీసులు పహారా కాస్తున్నా.. స్టేషన్ సమీపంలో ఉన్న తోటల్లో దాక్కుని సభను జరించారు. జాతీయ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి నాటి బ్రిటీష్ ప్రభుత్వం 1942 డిసెంబర్ 6వ తేదీన అరెస్ట్ చేసి రాజమండ్రి, తంజావూరు, రాయవెల్లూరు సెంట్రల్ జైళ్లల్లో రెండేళ్లపాటు బంధించింది. 1947–48లో జమీందారీ వ్యవస్థ పోరాటానికి కిల్లి మిలిటెంట్‌గా వ్యహరించారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తరువాత 1952లో నగిరికటకం నియోజకవర్గం నుంచి మొదటి సారిగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడంతో కృషికర్ లోక్ పార్టీ తరవున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

20 లోగా గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలి

పాతపట్నం: ఈ నెల 20వ తేదీ లోగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి గ్రీవెన్స్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఏఓ పి.కిరణ్‌వాణి గురువారం తెలిపారు. మండలంలోని అర్హులైన రైతులుకు ఈ పథకం కింద నగదు జమకాని వారు వీఏఏల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ పంటలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు.

వీఏఏకు మెమో జారీ

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు–కె గ్రామ సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకునిగా విధులు నిర్వహిస్తున్న ఆర్.మధు గతకొన్ని రోజులుగా విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. ఆయనకు మెమో జారీ చేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి ధానకర్ణుడు గురువారం తెలిపారు. మెమో జారీ చేసి మూడు రోజులైనా వీఏఏ నుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు. అసలు ఆయన ఎక్కడున్నారో సమాచారం కూడా లేదన్నారు.

అర్హులను గుర్తించడంలో అలసత్వం వద్దు

- నరసన్నపేట ఏడీఏ ఎల్.వి.మధు



మాట్లాడుతున్న ఏడీఏ, ఏఓ

పోలాకి: అర్హులను గుర్తించటంలో అలసత్వం వద్దని, అన్నదాత సుఖీభవ పథకం ఇంకా వర్తించని రైతుల నుంచి వినతులను స్వీకరించి సత్వరమే అప్‌లోడ్ చేయాలని వీఏఏలకు నరసన్నపేట ఏడీఏ ఎల్.వి.మధు సూచించారు. ఏఓ చిరంజీవి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల వ్యవసాయశాఖ సమీక్ష సమావేశంలో ఏడీఏ పాల్గొన్నారు. ఈ–క్రాప్ లక్ష్యాలు, డీబీటీ ద్వారా ఎరువుల పంపిణీ, పొలం పిలుస్తోంది వంటి అంశాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పనితీరు మెరుగుపర్చుకోవాలని, యాప్‌ల వినియోగంతోపాటు వాటిపై ఏఈఓల ద్వారా రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని సూచించారు. ఏఓ మాట్లాడుతూ ఎరువుల వినియోగంపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆధునిక వ్యవసాయం, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులను ప్రోత్సహించాలన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఆమదాలవలస: శక్తి యాప్ మహిళల పట్ల ఓ శక్తివంతమైన సాధనమని ఏఎస్ఐ డి.రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శక్తి యాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. అత్యవసర సేవల కోసం 181, 112, 1091, 1098, 1930, 1922 నంబర్లను సంప్రదించాలన్నారు. శక్తి టీమ్ తక్షణమే సహాయం అందిస్తుందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్, జె.రవిబాబు, అధ్యాపకులు, సిబ్బంది, శక్తి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

గోతులమయం..



నరసన్నపేట: కొత్తపేట వద్ద రోడ్డుపై నిల్వ ఉన్న వర్షం నీరు



సరుబుజ్జిలి: పోలీస్ స్టేషన్ సమీపంలో గోతులు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి నుంచి ఆమదాలవలస వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా పాడైంది. ఈ రహదారిలో ఏర్పడిన పెద్ద, పెద్ద గోతులు ఏర్పడటంతో చిన్న వర్షం కురిసినా నీరు చేరుతుంది. దీనివలన ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ప్రయాణికులు ప్రమాదాల బారీన పడుతున్నారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలోని రహదారి దారుణంగా ఉంది. వర్షా కాలంలో గుంతల్లో భారీ వాహనాలు దిగబడి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

రోడ్డుపైనే నీరు

నరసన్నపేట: మడపాం నుంచి కొత్తపేటకు వెళ్లే రోడ్డుపైనే నీరు నిల్వ అవుతుండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. చిన్న వర్షం పడినా నీరు రోడ్డుపైకి చేరుతుంది. రోజుల తరబడి నీరు రోడ్డుపైనే ఉండటంతో రోగాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జంక్షన్ వద్ద పాడైన రహదారి

ఐడీ కార్డుల వితరణ


నరసన్నపేట: మండలంలోని రావులవలస ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్న 60 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన శిమ్మ భీమారావు టై, ఐడీ కార్డులు వితరణ చేశారు. వీటిని హెచ్ఎం బమ్మిడి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. భీమారావుకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నేడు రక్తదాన శిబిరం

బూర్జ: ఈ నెల 15వ తేదీన మండలంలోని డొంకలపర్త గ్రామంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్తులు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో యువతీ, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని గ్రామస్తులు కోరారు.

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలి

- జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

పొందూరు: మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో బ్యాంకుల పాత్ర కీలకమని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ బ్యాంకులు, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డిపాజిట్లు, రుణాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక అంశాలపై చర్చించారు. సెర్ప్ సంస్థ ఆదేశాలను పాటించాలని సూచించారు. పీఎం ఫసల్ బీమా యోజన పథకం అమలయ్యేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వే పరిశీలన

హిరమండలం: స్వమిత్వ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని డిప్యూటీ ఎంపీడీఓ డి.గోవిందరావు అన్నారు. మండలంలోని అంబావల్లి గ్రామంలో సచివాలయ ఉద్యోగులు చేపడుతున్న స్వమిత్వ సర్వేను గురువారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఎటువంటి తప్పులు లేకుండా సర్వేను సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఈ సర్వేలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సర్వేయర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.